# చిన్ని కథ

సోమంచి నరసింహశాస్త్రి, బి.యస్.సి., బి.ఇడి.,

(ఆధునిక యుగము సినిమాయుగము. సినిమాను చూడనివారిని మానవులుగ పరిగణించుటలేదు యీ యుగము. సినిమా తారలను ఆదర్శముగ తీసికొని ప్రవర్తించుట యీ యుగ ధర్మమయినది. అద్దాని ప్రయోజన మెంతవరకు అనే ప్రశ్న లేనే లేదు.

కలలో మనము పరోక్షముగా నుండి అనుభవించు అనుభవము వంటిదే. యీ సినిమా అనుభవమని గమనించు వారు అరుదు. అయ్యాది "వినోదప్రదర్శనము" అని గ్రహించువారు కొలదిమంది మాత్రమే. అట్టి వినోదమునుండి విద్యను గ్రహించువారు స్వల్పము.

సినిమాతారల ఛాయా చిత్రములను సేకరించుట ఒకఆచారము అయింది యీ నాగరికతా ప్రపంచమందు. సినిమాతారలను కలసికొనవలయునన్న ఆసక్తి ప్రబలమయింది. తారలతో మాట్లాడుటే విద్య యని అనుకొనుట సామాన్య మయింది.

ఇట్టి వాతావరణముతో కూడియున్న ప్రపంచమందు జరుగుచున్న "ఒక భ్రమ ప్రమాదము"ను వ్యక్తము చేయునది యీ నా చిన్నికథ. ఇది కేవలము ఊహామాత్రము. వాస్తవమందు ఎవ్వరికిని సంబంధించినదికాదు.

కావున యేరికైనను మనసున కష్టము కల్గించిన క్షమింపవలయునని పాఠక మహాశయులకు విజ్ఞప్తి.
(—రచయిత)

---

ఆమెకు పందొమ్మిది వత్సరములు. సినిమాలు అంటే సరదా. క్రొత్తగా బొంబాయి వచ్చింది. నాజూగ్గా వుంటుంది. నవీన పద్ధతులలో పెరిగింది. 'ఖార్' లో వుంటోంది పినతండ్రిగారి యింట్లో. ఒకనాటి సాయంకాలము "చర్చిగేటు" వెళ్ళుటకు స్టేషనుకువచ్చి అతనిని చూసింది. అతనికి సుమారు యిరువది అయిదు వత్సరము లుండునేమో. చూచి చూచుటతోడనే ఆమె అనుకొంది 'తప్పక నటుడు అయివుంటాడని' అతని చేతులో నున్న చేతికర్రను, అతని దుస్తులను ఆమె భావమును స్థిరము చేసినవి. అతనివైపు తీక్షణముగా చూచింది ఆమె. అతడును ఆమెవైపు చూచాడు. అట్లా చాలసేపు చూచుకొన్నారు ఒకర్ని ఒకరు. కాని పలుకరించుకోలేదు, ఆమె అతడు ఎక్కిన కంపార్టుమెంటులోనే ఎక్కింది. 'దాదరు' లో దిగిపోయేడు. ఆమె ముందుకు సాగింది, మనస్సును అతనికి వదలి ఆమె ఆలోచిస్తోంది. "తప్పక నటుడు అయివుంటాడు. లేకపోతే ఆవిధంగా వుండడు, మామూలుగా వుండే మనుష్యులకు, నటకులకు తేడా తప్పక వుంటుంది. యితడు తప్పక నటవర్గములో చేరి వుండి వుంటాడని. చేరి వుండట మేమిటి. తప్పక నటకుడే..." అనే అభిప్రాయాలు ఆమెను చుట్టుముట్టినయి. ఈ అభిప్రాయాలే ఆమెను కలవర పెట్టినాయి; ఆనాడు రాత్రి నిద్రపట్టకుండ జేసేయి.

మరునాడు అదే టైముకు బయలుదేరింది ఆమె స్టేషనుకు. ఆతడుకూడా వచ్చినాడు. క్రితం రోజున జరిగిన పనే ఆరోజున జరిగింది. ఇట్లు వారంరోజులు గడిచాయి. ఇంక కొంతముందుకు వెళ్ళాలనుకొంది ఆమె. ఎనిమిదవ రోజున ప్లాటుఫారం మీద యిద్దరు వున్నారు. రైలు యింకను రాలేదు. ఆమే తానున్న స్థలము నుండి అతనివైపు చూచి నవ్వింది. అతనికి ఆశ్చర్య మేసింది. ఎవరినో తెలిసిన వారిగ భావించిందేమో అని అనుకొన్నాడు. కాని ఆమె అదేపనిగ తనవైపుచూచి, చిరునవ్వులను ప్రారంభించుట అతనికి నచ్చలేదు. తనలో ఏదో లోప మున్నదేమోనని దేహము కలయచూచు కొన్నాడు. కాని లోపముంటేగా కనిపించడానికి. ఇకఉండబట్టలేకపోయేడు వెంటనే ఆమెను సమీపించాడు, తానే ఉపక్రమించాడు—సంభాషణకి "మనము యిదివరలో కలసికొన్నట్లుందే?"

అని ప్రశ్నించాడు "కలసికొని వుండవచ్చు. అనేకమందిని కలిసి కొంటూంటాము రోజూ" అని సమాధానమిచ్చింది. ఆమె కొంచెతనంగా. ఆమె మాటలు అతనికి అర్థము కాలేదు. కాని నెమ్మదిగ "అవునవును" అని అన్నాడు. అని అతడు తదేక దీక్షతో చూడసాగాడు ఆమెను.

అతడు అట్లు తన్ను చూస్తూంటే ఆమెకు వళ్ళు జలదరించింది. అతడు తన్ను ఒక 'నటి'గా భ్రమ పడుచున్నాడేమో!...ఎందుకు భావించరాదు.

తాను అందముగా నున్నది. చక్కగా దిద్దుకొన్నది. విలువైన దుస్తులను ధరించింది. ఈ విధమైన ఆలోచనలు పరిగెత్తాయి ఆమెలో. ఆలోచనలతో ముఖము ఎర్రబడింది. చెమట బిందువులు నుదుటిపైనుండి చెంపలపై పడసాగాయి. ఆస్థితి ఆమెకు వింతశోభను సమకూర్చింది. అతడు ఆమెను చూస్తూ అట్లా వుండి పోయాడు. శీతాకాలములో ఉదయమున వికసించిన ఎర్రగులాబీ జ్ఞాపకమొచ్చింది అతనికి. ఆమాట అందామనుకున్నాడు. కాని అంతలోనే ఆమెమనస్సును కుదుటబరచుకొని ధైర్యంతో అతనితో "ప్రస్తుతము పనిలోవున్నారా?" అని ప్రశ్నించింది. ఎలెక్ట్రిక్ ట్రెయిన్ వస్తోంది. ప్లాటుఫారము రైలు వేగమునకు దడదడ లాడింది. ఆమెను జాగ్రత్త అని హెచ్చరించేటట్టు ఆమె చేతిని అతడు గట్టిగా పట్టుకొని వెనుకకు లాగాడు. నెమ్మదిగ రైలు ఆగింది, ప్యాసింజర్లు దిగుచున్నారు.

"అవును దాదరులో పనిచేస్తున్నాను" అని చెప్పి జనసమూహములోనుండి ఆమెను రైలు సమీపమునకు తీసికొని వచ్చాడు. అపరిచితునికరస్పర్శ ప్రప్రథమంగా అనుభవించింది ఆమె. ఆమె గుండెలు కొట్టుకొంటూన్నాయి. ఏమి మాట్లాడాలో తెలియలేదు. "ఆ, అట్లాగా" అని మాత్రం అనగల్గింది. రైలులో మెక్కారు యిద్దరు. రైలు కదలింది. క్షణక్షణము రైలు వేగ మెక్కువవుతోంది. ఆమెకు ఆ సంగతే తెలియుటలేదు. ఎక్కడ వున్నదో, ఎవ్వరితో వున్నదో, తెలియుటలేదు. అంతా అగమ్యగోచరంగా వున్నది. ఏదో వూహా ప్రపంచంలో వుండిపోయింది ఆమె. ఆమె ఆలోచనల కంతరాయం కల్గించింది దాదరునుండిపోయే డక్కన్‌క్వీన్ యొక్క విజిల్.

"మీకు సినిమా చూడాలని వున్నదా?" అని ప్రశ్నించాడు అతడు. ఆమె అతనివైపు తీక్షణంగా చూచింది.

"చూడాలని వున్నది. సినిమా చూడడం నాకుసరదా" అని ఆమె అన్నది.

"అయితే యీవేళ చూతామా" అన్నాడాతడు.

"తప్పకుండా" అని అన్నదామె.

"అయితే రాత్రి 8 గంటలకు దాదరులో నున్న ప్లాజా థియేటరువద్ద నన్ను కలియండి" అని అన్నాడాతడు.

"మీరు అచ్చట వుంటారా?" అని ప్రశ్నించిందామె.

"నేను తొంభై తొమ్మిదిపాళ్ళు వైటింగ్ రూమ్‌లో వుంటాను మీకొరకు. ఒకవేళ నేను కనుపించక పోతే 'కుమార్' కొరకు వచ్చానని అచ్చటి బంట్రోతుతో చెప్పిన నాకు కబురందును నేను వెంటనే వస్తాను" అని అన్నాడతడు.

ఆమె "కుమార్! —రాత్రి 8 గంటలు"— అని నెమ్మదిగా ఒకసారి అనుకున్నది.

"నేను తప్పక వస్తాను" అని అన్నదామె.

ఇక సంభాషణజరుగలేదు మౌనంగా వున్నారుయిద్దరు దాదర్ స్టేషన్ వచ్చింది. అతడు వెళ్ళిపోతూ ప్లాజా థియేటరు వద్ద రాత్రి ఎనిమిది గంటలకు నీకోసం ఎదురు చూస్తు ఉంటాను" అని చిరునవ్వుతో అన్నాడామెతో.

"సర్టన్లీ విదవుట్ ఫెయిల్" అని అన్నదామె.

"రాత్రి థియేటరు" వద్దకు 8 గంటలకు సరిగావచ్చిందామె. జాగ్రత్తగా అలంకరించుకొంది. తాను అతనికి అందంగా కనిపించాలని ఆమె వూహ. ఏమో, అతని తోడి స్నేహము ఎట్లాపరిణమిస్తుందో థియేటరు ఎదుట తన దేహము నంతను కలియచూసుకొంది. చాలా అందంగా వున్నాననుకొంది. సగర్వంగా చిరునవ్వు నవ్వుకొంది. థియేటరులోనికి వెళ్ళింది ఆమె. "నేను యిపుడు సాధారణ యువతిని కాదు. నటకుడైన కుమార్ కొరకు వచ్చిన దానిని. అతడు నా అందచందములకు ముగ్ధుడై సన్నాహ్వానించాడు, యిచ్చటికి అని విజయసూచకముగా నవ్వుకొని, గర్వముతో అక్కడ నున్న మనుష్యులను చూస్తోంది. క్రమముగా వైటింగ్‌రూమ్ వద్దకు నడిచింది అచ్చట "కుమార్"లేడు. చుట్టూ అతని కొరకుచూసింది, దగ్గరగానున్న రిజర్వుడ్ క్లాస్ బుకింగ్ క్లార్కు "ఎన్ని టికెట్లు" అని ప్రశ్నించాడు, "నేను టిక్కట్టు కొనడం లేదు" అని అందామె.

"అయితే ఎందుకలా నిలబడ్డారు" అని అన్నాడు బుకింగ్‌క్లార్కు విసుగుతో.

"నేను కుమార్ కొరకు వచ్చాను. ఆయన కొరకు చూస్తున్నాను" అని ఆమె అన్నది.

కుమార్ మాట విన్నతోడనే బుకింగ్‌క్లార్కు ధోరణి మారింది. వెంటనే తానుకూర్చున్న స్థలమునుండి బయటికివచ్చి ఆమెను అక్కడ వున్న ఒక కుర్చీలో కూర్చోమని చెప్పాడు. తాను కుమార్ కొరకు కబురంపగలనని చెప్పాడు. వెంటనే ప్రక్కని వున్న ఒక సేవకుని పిలిచి నెమ్మదిగా ఏదోచెప్పి తనపని చూచుకోడానికి వెళ్ళాడు. ఆ సేవకుడు వెంటనే అచ్చటినుండి వెళ్ళి పోయేడు.

కుర్చీలో కూర్చొన్న ఆమె అప్పుడు కొంచెము కంగారు పడింది. 'కుమార్ వున్నాడో, లేదో, ఏమి సమాధాన మివ్వాలో, తాను జ్ఞాపకము వస్తానోలేదో" అనే ఆలోచనలు బుర్రలో పరుగెత్తాయి. కొద్దిగా చెమటపట్టింది. హేండ్‌బేగ్‌లో వున్న అద్దముతీసి జాగ్రత్తగా ముఖము కర్చీఫ్‌తో తుడుచుకొంది.

ఈలోపుగానే సేవకుడు వచ్చి "కుమార్‌గారు యిపుడే వస్తామన్నారు మిమ్ములను కూర్చో మన్నారు" అని చెప్పాడు. కొద్దినిముషములలో 'కుమార్' వచ్చాడు. ఆ దీపపు కాంతులలో ఒకరిని ఒకరు చూచుకొన్నారు. చిరునవ్వు నవ్వుకున్నారు. దగ్గరగవచ్చి అతడు కరము సాచి ఆమెను ఆహ్వానమిచ్చాడు. ఆమె సగర్వంగా అతన్ని చూచింది. తాను రోజుచూచే వానికంటె చాలా అందంగా కనిపిస్తూన్నాడు. తాను గొప్ప అదృష్టవంతు రాలుగ భావించుకొంది. అతనివంటి వారి స్నేహము దొరికినందులకు.

అతడు ఆమెను బాల్కనీ పైకితీసికొని వెళ్ళి ధియేటరులో కూర్చుండజేసాడు. తానుపక్కన ఆసీనుడయ్యాడు అచ్చటి గేట్‌కీపర్‌తో రెండు కూల్‌డ్రింక్సు. బిస్కట్లు, పట్టుకొని రమ్మని చెప్పాడు. వెంటనే ఆ సేవకుడుపోయి ఆపదార్థములు తీసికొని వచ్చాడు.

బిస్కట్లు ఆమెను తినమని యిచ్చాడు. తాను తింటూ ఇంతలో యేదో జ్ఞాపకము తెచ్చుకొని సేవకుని పిలిచి, విశ్రాంతి సమయంలో అక్కవుంటు చూస్తానని మేనేజరుతో చెప్పమన్నాడు సేవకుడు వెళ్ళిపోయేడు.

ఈ సంభాషణ వింటూన్న ఆమె "మీరు నటకులు కారా?" అనే ప్రశ్న నోటిచివరదాక తెచ్చుకొని, ప్రశ్నించలేక ఆగిపోయింది, తన తప్పిదానికి సిగ్గుపడుతూ. —

